

చాపకింద నీరులా..



● విస్తరిస్తోన్న హెచ్ఐవీ

- ఉమ్మడి జిల్లాలో 10,095 మంది హెచ్ఐవీ బాధితులు
- రోజు రోజుకు పెరుగుతున్న కేసులు
- సురక్షితం కాని లైంగిక సంబంధాలే ప్రధానకారణం
- అవగాహన కల్పించడంలో వైద్య ఆరోగ్యశాఖ విఫలం



సీడీ4 కౌంట్ పరీక్ష చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్





మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం), జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక స్థోమత లేక కొందరు... అవగాహన లేక మరికొందరు... లైంగిక సంబంధాల ద్వారా ఇంకొందరు.. ఇలా ఒక్కొక్కరు ఒక్కో కారణంతో హెచ్ఐవీ వ్యాధి బారిన పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 2007 నుంచి ఇప్పటి వరకు గణాంకాలను చూస్తే 10,095 మంది హెచ్ఐవీ బాధితులు ఉన్నారు. అయితే ఈ వ్యాధి విస్తృతంగా వ్యాపిస్తుండగా, రోజు రోజుకు కేసులు పెరుగుతూనే ఉన్నాయి. అదే స్థాయిలో మరణాలు కూడా సంభవిస్తున్నాయి. ఈ వ్యాధి వ్యాప్తికి సురక్షితం కాని లైంగిక సంబంధాలే మూలకారణంగా నిలుస్తున్నాయి. కానీ ప్రభుత్వం వ్యాధి నియంత్రణ, నిర్మూలన కోసం దృష్టి పెట్టడం లేదు. అందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంలో విఫలమవుతోంది. దీంతో వ్యాధి సోకిన వ్యక్తులు చనిపోవాల్సిన దుస్థితి ఎదురైంది.

● లైంగిక సంబంధాలే ప్రధాన కారణం

హెచ్ఐవీ సోకేందుకు ప్రధానంగా ఉమ్మడి జిల్లాలో లైంగిక సంబంధాలే ప్రధాన కారణంగా వైద్యులు చెబుతున్నారు. ఇప్పటికీ ఉమ్మడి జిల్లాలో వలసలు వెళుతుండటం, అక్కడి నుంచి ఈ లైంగిక సంబంధాల ద్వారా జిల్లాకు అంటగడుతున్నారు. ఫలితంగా ఆయా జిల్లాలో దాని ప్రభావం తీవ్రంగా కనిపిస్తోంది. గతంలో పట్టణ ప్రాంతాలకే పరిమితమైన ఈ వ్యాధి నేడు గ్రామీణ ప్రాంతాలను సైతం కుదిపేస్తున్నది. ఎక్కువ శాతం పట్టణ యువకుల్లో ఈ వ్యాధిని గుర్తిస్తున్నారు. రక్తమార్పిడి వలన 5 శాతం నిర్ధారణ అవుతుండగా, మిగతా 95 శాతం సురక్షితం కాని లైంగిక సంబంధాల ద్వారా హెచ్ఐవీ బాధితులు పెరుగుతున్నారు. అదేవిధంగా జాతీయ రహదారికి దగ్గరలో ఉన్న మండలాల్లో కూడా ఇది అధికంగా కనిపిస్తోంది. ఇదిలా ఉండగా, సెక్స్ వర్కర్లు, మగవారితో సంభోగం

- మిగతా 6లో..

● 10,095 మంది బాధితులు...

ఉమ్మడి జిల్లాలో హెచ్ఐవీ చాపకింద నీరులా వ్యాపిస్తోంది. 2007 నుంచి ఇప్పటి వరకు 10,095 మంది హెచ్ఐవీ బాధితులు ఉన్నారు. అందులో జిల్లాలోని ఆయా మండలాలు, జాతీయ రహదారికి పక్కన ఉన్న మండలాల్లో ఇది ఎక్కువగా ఉంది. ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ఈ వ్యాధి ప్రస్తుతం పట్టణ ప్రాంతాలకు వేగంగా వ్యాపిస్తోంది. ప్రధానంగా మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోనే ఎక్కువగా విస్తరిస్తోంది. గత ఏడాది 2024 డిసెంబర్ వరకు 1324 కేసులు ఉండగా, ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు 6 నెలల్లో 223 కొత్త కేసులు నమోదు కావడం గమనార్హం.



రహదారికి పచ్చని పందిరి

వానాకాలం వచ్చేసింది.. ప్రకృతి పరవశించింది.. చెట్లు చిగురించి పచ్చని ఆకులతో కొత్త అందాలను సంతరించుకున్నాయి.. కొమ్మలు పరిచి రహదారికి పచ్చని పందిరి వేసి, వాహనదారులకు కనువిందు చేస్తున్నాయి. వనపర్తి జిల్లా, గోపాల్‌పేట మండలంలోని బుద్దారం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న వృక్షాలు పచ్చగా కళకళలాడుతూ వాహనదారులకు ఆహ్లాదం కలిగిస్తున్నాయి. శుక్రవారం ఈ దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' కెమెరాలో బంధించింది.

- ఆంధ్రజ్యోతి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వనపర్తి

పేదలను అక్కున చేర్చుకునేది కాంగ్రెస్సే

- కల్వకుర్తి, తలకొండపల్లిలకు 30 పడకల ఆసుపత్రులు మంజూరు
- విద్యా నైపుణ్యాలను పెంపొందించుకోవాలి
- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కాంగ్రెస్‌తోనే సాధ్యం
- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ

6



కల్వకుర్తిలో వంద పడకల ఆసుపత్రికి శంకుస్థాపన చేస్తున్న మంత్రులు దామోదర రాజనరసింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు

భక్తిశ్రద్ధలతో ఆషాఢం పూజలు



శాకాంబరీ దేవి అలంకరణలో అన్నపూర్ణేశ్వరి

గద్వాల టౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ఆషాఢమాసం రెండవ శుక్రవారాన్ని పురస్కరించుకొని గద్వాల పట్టణంలోని దేవీ ఆలయాల్లో అమ్మవారికి భక్తులు విశేష పూజలు చేశారు. పాతహౌసింగ్ బోర్డు కాలనీలోని అన్నపూర్ణ ఆలయం, గాంధీచౌక్‌లోని కాళికా దేవి ఆలయాల్లో అమ్మవారు శాకాంబరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని లిల్లీపూలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆలయాల్లో మహిళలు సామూహిక కుంకుమార్చనలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు.

ఆ నాటి దుర్ఘటనకు ఐదేళ్లు

- 2020, ఆగస్టు 20న శ్రీశైలం ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో భారీ అగ్ని ప్రమాదం
- బ్యాటరీలు మారుస్తుండగా చెలరేగిన మంటలు
- 9 మంది మృతి, కోట్లాది రూపాయల ఆస్తి నష్టం

దోమలపెంట, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రం నిర్మాణం ఆసియా ఖండంలోనే అత్యంత అద్భుతం. ఈ విద్యుత్ కేంద్రాన్ని పూర్తిగా జపాన్ సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించారు. ఇందులో 6 యూనిట్లు ఉన్నాయి. ఒక్కో యూనిట్ 150 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేయగల సామర్థ్యం కలిగి ఉన్నాయి. ప్రారంభించాక 20 సంవత్సరాల పాటు ఎటువంటి సాంకేతిక ఇబ్బందులూ తలెత్తలేదు. సజావుగా విద్యుత్ ఉత్పత్తి కొనసాగింది. కానీ ఐదు సంవత్సరాల క్రితం 2020, ఆగస్టు 20న విద్యుత్ కేంద్రంలో బ్యాటరీలను మార్చుతుండగా, షార్ట్ సర్క్యూట్ ఏర్పడింది పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. ప్రమాదంలో 9 మంది ప్రాణాలు కోల్పోయారు. వందల కోట్ల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లింది. అప్పుడు పాడైన 4వ యూనిట్ నేటికీ వినియోగంలోకి రాలేదు.



ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో అగ్నికీలలు ; (ఇన్‌సెట్‌లో) మంటలను ఆర్పుతున్న సిబ్బంది (ఫైల్)



విద్యుత్ కేంద్రంలోని 4వ యూనిట్‌ను మరమ్మతు చేస్తున్న సిబ్బంది

కొనసాగుతున్న మరమ్మతు

అగ్ని ప్రమాదంలో పూర్తిగా దెబ్బతిన్న 4వ యూనిట్‌ను వినియోగంలోకి తెచ్చేందుకు జెన్‌కో అధికారులు తీవ్రంగా కృషి చేస్తున్నా, ఇప్పటివరకు పనులు పూర్తి కావడం లేదు. ఢిల్లీకి చెందిన వాయిత్ కంపెనీ యూనిట్ మరమ్మతు పనులను పూర్తి చేసి 2023, జూలైలో వినియోగంలోకి తెచ్చింది. కానీ కొద్ది రోజులకే మరోసారి స్టేటర్ బార్ వైండింగ్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయింది. దీంతో వాయిల్ కంపెనీ స్టేటర్ బార్‌లను చైనా నుంచి తెప్పించి పనులను ప్రారంభించింది. గత నెలలో రోటార్ పనులను పూర్తి చేశారు. స్టేటర్ వైండింగ్‌కు సంబంధించి ఇప్పటికే ఈఎల్‌సీఐడీ (ఎలక్ట్రో మాగ్నటిక్ కోర్ ఇంప్రఫికేషన్ డిటెక్షన్ టెస్ట్) నిర్వహించారు. స్టేటర్‌లో వైండింగ్ బార్లు దాదాపు 950 వరకు ఉంటాయి. రెండు సంవత్సరాల క్రితం సాంకేతిక లోపం ఏర్పడి అందులో 150 వరకు కాలిపోవడంతో వాటిని తొలగించారు. ఇంకా ఏమైనా వైండింగ్ బార్లను తొలగించాల్సిన అవసరం ఉందా అని గుర్తించేందుకు మరో సారి హెచ్‌వీ టెస్టు (హై వోల్టేజీ) చేసేందుకు ఇంజనీర్లు సిద్ధం అయ్యారు.

పనుల పూర్తికి ముగుస్తున్న గడువు

ఈ ఏడాది విద్యుత్ ఉత్పత్తి సీజన్ నాటికి 4వ యూనిట్ మరమ్మతు పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని ప్రభుత్వం ఈ నెల 14 వరకు గడువు విధించింది. విద్యుత్ ఉత్పత్తి సీజన్ ఆగస్టు నుంచి నవంబర్ వరకు కొనసాగిస్తారు. అనంతరం ప్రాజెక్టులో ఉన్న నీటిని బట్టి అవసరాలకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తారు. వాయిత్ కంపెనీ, జెన్‌కో ఉద్యోగులు దాదాపు 25 మంది ప్రతీ రోజు పని చేస్తున్నా, యూనిట్ మరమ్మతు పనులు పూర్తయ్యేందుకు ఇంకా రెండు నెలలు పట్టే అవకాశముందని నిపుణులు చెప్తున్నారు.

లోపాలను పసిగట్టేందుకు సెన్సర్లు

రోటార్, స్టేటర్ బార్లలో తలెత్తే సాంకేతిక సమస్యలను ముందుగానే గర్తించి ఎప్పటికప్పుడు సూచనలు ఇచ్చేందుకు ప్రత్యేకమైన సెన్సర్లను బిగించనున్నారు. వాటి పని తీరును ప్యానల్ మానిటర్‌లో గమనించవచ్చని ఇంజనీర్లు చెప్తున్నారు. దీంతో రాబోయే లోపాలను గుర్తించి ముందుగానే చర్యలు చేపట్టే వీలుంటుందని అభిప్రాయపడుతున్నారు.

వానాకాలం సాగుకు ఫికర్ లేనట్లే!

- జూరాల ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న నీరు
- నిండుతున్న కోయిల్ సాగర్ ప్రాజెక్టు
- ఆయకట్టుకు సమృద్ధిగా అందనున్న సాగునీరు

6

చేనేత కార్మికులకు ప్రత్యేక శిక్షణ

- వృత్తి నైపుణ్యం పెంపొందించేందుకు చర్యలు

7

పునరావాస కల్పనకు కృషి

- ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కమిషనర్ శివకుమార్ నాయుడు
- కొల్లాపూర్ మండలంలోని సున్నపుతండా, అంజనగిరి, బోడబండ తండాల్లో పర్యటన

6

గంగానది అంత పవిత్రమైనది కాంగ్రెస్

- పార్టీలో భిన్నాభిప్రాయాలు తప్ప భేదాభిప్రాయాలు లేవు
- హామీలను అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి కుసుమకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న జెట్టి కుసుమకుమార్, పాల్గొన్న జిల్లా నాయకులు

వనపర్తి టౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : గంగానది అంత పవిత్రమైనది కాంగ్రెస్ పార్టీ అని **కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి కుసుమకుమార్** అన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కుసుమ కుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు దక్షిణ తెలంగాణ ప్రాంతమైన పాలమూరు జిల్లా కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉండిందన్నారు. 140 ఏళ్ల చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ జీవనదిలా ఎప్పటికీ ఎండిపోదన్నారు. కాంగ్రెస్ ముందు ఎన్నో పార్టీలు ఆవిర్భవించి, నామరూపాలు లేకుండా పోయాయని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ మాత్రం ఎప్పటికీ నిటారుగా నిలబడుతుందన్నారు. పార్టీలో భిన్నాభిప్రాయాలే తప్ప బేధాభిప్రాయాలు లేవని స్పష్టం చేశారు. చిన్నారెడ్డి కాంగ్రెస్ పార్టీకి సుపరిచితుడని, రాజీవ్ గాంధీ ప్రధాన మంత్రి హోదాలో ఉన్నప్పుడు ముఖ్యమంత్రిని పక్కన బెట్టి చిన్నారెడ్డిని తన కారులో ఎక్కించుకున్న సందర్భం తనకు ఇంకా గుర్తుందన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ, ఇవ్వని హామీలను కూడా అమలు చేస్తూ సంక్షేమం వైపు అడుగులు వేస్తోందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ జెండానే ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఇన్‌చార్జి కొండేటి మల్లయ్య, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, సంధ్యారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, పాహీం, శంకర్‌ప్రసాద్, చీర్ల జనార్దన్, పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కదిరె రాములు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధే ధ్యేయం

» విద్యా కమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేశ్



తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడుతున్న చారకొండ వెంకటేశ్

వంగూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని విద్యాకమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేశ్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా, వంగూరులోని ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన చెస్ ఆర్గనైజేషన్ మీట్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు చదరంగంలో శిక్షణ ఇచ్చి, ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత మండలమైన వంగూరుతో పాటు, పోల్కంపల్లిలో పైలట్ ప్రాజెక్టు ద్వారా తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఆయన పోల్కంపల్లి ప్రభుత్వ పాఠశాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో మురళీ మోహనాచారి, కోచ్ విజయభాస్కర్, మంద రాంరెడ్డి పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

» డీఆర్‌డీవో ఉమాదేవి



రుక్కన్నపల్లిలో మొక్కను నాటుతున్న డీఆర్‌డీవో ఉమాదేవి

ఖిల్లాఘణపురం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : మొక్కలు విస్తృతంగా నాటి సంరక్షించాలని డీఆర్‌డీవో ఉమాదేవి తెలిపారు. వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలంలోని రుక్కన్నపల్లి, ఖిల్లాఘణపురంలో శుక్రవారం నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రుక్కన్నపల్లిలో నర్సరీని పరిశీలించారు. దేవాలయం ఆవరణంలో మొక్క నాటి నీరు పోశారు. ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మిస్తున్న గొర్రెల షెడ్డును పరిశీలించారు. అనంతరం ఖిల్లాఘణపురం సబ్ స్టేషన్ నుంచి షాపూర్ వరకు రోడ్డుకిరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వనమహోత్సవంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. ఇళ్లలో నాటుకునేందుకు అవసరమైన మొక్కలు నర్సరీల్లో సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీరు పోసి సంరక్షించాలని సూచించారు. ఉపాధి హామీ పథకం ద్వారా లబ్ధిదారులు సబ్సిడీతో గొర్రెలు, బర్రెల షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సునీత, ఎంపీవో రాజు, ఏపీవో లక్ష్మి, నాయకుడు ప్రకాష్ పాల్గొన్నారు.

వానాకాలం సాగుకు ఫికర్ లేనట్లే!



కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో నిండుగా నీరు

» 'జూరాల' నుంచి విడుదలవుతున్న నీరు

» నిండుతున్న కోయిల్ సాగర్ ప్రాజెక్టు

» ఆయకట్టుకు అందనున్న సాగునీరు

దేవరకద్ర, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లాలోని మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టు కోయిల్‌సాగర్ జలకళను సంతరించుకుంటోంది. గత నెల రోజులుగా జూరాల ప్రాజెక్టు నుంచి వస్తున్న నీటితో నిండుకుండను తలపిస్తోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 32.2 అడుగులు కాగా, ప్రస్తుతం 23.5 అడుగులకు చేరింది. వర ద ఇలాగే కొనసాగితే త్వరలోనే ప్రాజెక్టు పూర్తి నిండే అవకాశం ఉంది. దీంతో వానాకాలం పంటల సాగుకు ఇబ్బంది ఉండదని ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నాట్లు వేసేందుకు వరి నారును సిద్ధం చేసుకుంటున్నారు.

12 వేల ఎకరాల ఆయకట్టు..

జిల్లాలోని దేవరకద్ర, చిన్నచింతకుంట, ధన్వాడ, మరికల్ మండలాల్లో కోయిల్‌సాగర్ ప్రాజెక్టు కిందనున్న 12 వేల ఎకరాల పాత ఆయకట్టుకు కుడి, ఎడమ కాల్వల ద్వారా సాగునీరు అందుతోంది. అదనంగా చేర్చిన 38 వేల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం కాల్వల నిర్మాణం కొనసాగుతోంది.

ఆనందంగా ఉంది

జూరాల ప్రాజెక్టు నుంచి నీరు వస్తుండటంతో కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. దీంతో పంటలకు సమృద్ధిగా సాగునీరు అందే అవకాశం ఉంది. వెంటనే కాల్వలకు సాగునీరు విడుదల చేయాలి.

- అనంతయ్య, రైతు, పెద్ద రాజమూరు

నీటిని విడుదల చేస్తాం

కోయిల్‌సాగర్ ప్రాజెక్టుకు జూరాల నుంచి నీరు వచ్చి చేరుతోంది. ఆయకట్టులో సాగవుతున్న పంటలకు సాగునీటిని విడుదల చేస్తాం. ఎమ్మెల్యే, ఉన్నతాధికారుల ఆదేశం మేరకు మరో వారం రోజుల్లో కుడి, ఎడమ కాల్వల ఆయకట్టుకు నీరు అందిస్తాం.

- ప్రతాప్‌సింగ్, ప్రాజెక్టు ఈఈ

ఉమామహేశ్వరం అభివృద్ధికి చర్యలు

» అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ » ఆలయానికి రెండు బస్సుల వితరణ

అచ్చంపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఉమామహేశ్వర క్షేత్రం అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. సీబీఎం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆలయానికి రెండు బస్సులను అందించారు. వాటిని ట్రస్ట్ చైర్మపర్సన్ డాక్టర్ అనురాధతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులు ఉమామహేశ్వర స్వామికి ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భోగ మహేశ్వరం నుంచి భక్తులు కొండపైకి వెళ్లేందుకు బస్సులను వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి, ఈవో శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్, మునిసిపల్ చైర్మన్ శ్రీనివాస్‌రావు, వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ రజిత, పాలశీతలీకరణ కేంద్రం చైర్మన్ నరసయ్య యాదవ్, నాయకులు లచ్చునాయక్, సోమ్లా పాల్గొన్నారు.



సీబీఎం ట్రస్ట్ చైర్మపర్సన్ డాక్టర్ అనురాధతో కలిసి బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

పూడికతీతతో భూగర్భ జలాల పెంపు



నందివడ్డెమాన్‌లోని సూరమ్మకుంటను పరిశీలిస్తున్న కేంద్ర జలశక్తి అభియాన్ నోడల్ అధికారి అతర్వ్ పవార్

బిజినేపల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : చెరువులు, కుంటల్లో పూడిక తీస్తే భూగర్భ జలం పెరుగుతుందని కేంద్ర జలశక్తి అభియాన్ నోడల్ అధికారి అతర్వ్ పవర్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా, బిజినేపల్లి మండలంలోని నందివడ్డెమాన్, లింగసానిపల్లి గ్రామాల్లో శుక్రవారం ఆయ న పర్యటించారు. 2023-24లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. లింగసానిపల్లిలో నిర్మించిన కమ్యూనిటీ ఇంకుడు గుంతను పరిశీలించారు. నందివడ్డెమాన్‌లోని సూరమ్మ కుంట పూడిక తీయడం వల్ల ఉపయోగాలను రైతులతో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీవో రాజేశ్వరి, రాజేశ్‌కుమార్, క్రాంతి కుమార్, పవన్, ఎంపీడీవో కతలప్ప, పంచాయతీ కార్యదర్శి లింగారెడ్డి, ఏపీవో మల్లికార్జున్, ఈసీ రామ్మోహన్, రాజు, రమేశ్ తదితరులు ఉన్నారు.

పునరావాస కల్పనకు కృషి

» ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కమిషనర్ శివకుమార్ నాయుడు



నిర్వాసితులతో మాట్లాడుతున్న కమిషనర్ శివకుమార్ నాయుడు

కొల్లాపూర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు -రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణంలో ముంపునకు గురైన గ్రామాల నిర్వాసితులకు పునరావాసం కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కమిషనర్ శివకుమార్ నాయుడు తెలిపారు. అందుకోసం నాగర్‌కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ మండల పరిధిలోని సున్నపుతండా, అంజనగిరి, బోడబండ తండా ప్రాంతాలను శుక్రవారం పరిశీలించారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణంలో ముంపునకు గురైన 117 కుటుంబాలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద పరిహారం అందించినా, నేటికీ గృహాలను ఏర్పాటు చేయలేదు. దీంతో బాధితులు ఇటీవల మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి సమస్యను వివరించారు. ఆయన ఆదేశం మేరకు కమిషనర్ నిర్వాసిత కుటుంబాలకు సంబంధించిన వివరాలను స్వయంగా సేకరించారు. కేంద్రాల ఏర్పాటుకు స్థలాలను పరిశీలించారు. కార్యక్రమంలో జేపీ అమరేందర్, స్పెషల్ కలెక్టర్లు మధుసూదన్ నాయక్, యాదగిరి, ఆర్డీవో భన్సీలాల్, తహసీల్దార్ విష్ణువర్ధన్ రావు, రెవెన్యూ అధికారులు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు హనుమంత్ నాయక్ పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో వ్యక్తికి జైలు శిక్ష

నాగర్‌కర్నూల్ క్రైం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన వ్యక్తికి న్యాయాధికారి జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు. మధ్యప్రదేశ్‌కు చెందిన రాజ్‌కుమార్ నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఇటీవల మద్యం తాగి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. నిందితుడిని శుక్రవారం కోర్టులో ప్రవేశపెట్టారు. అతడికి నాలుగు రోజుల జైలు శిక్ష విధిస్తూ జిల్లా ఫస్ట్‌క్లాస్ న్యాయాధికారి శ్రుతిదూత తీర్పు వెల్లడించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పేదలను అక్కున చేర్చుకునేది కాంగ్రెస్సే

» బీసీలకు 42శాతం రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ కాంగ్రెస్‌తోనే సాధ్యమైంది

» కడ్తాల, తలకొండపల్లిలకు 30పడకల ఆసుపత్రులు మంజూరు

» రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ

కల్వకుర్తి, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : దేశంలో రాష్ట్రంలో పేదలను అక్కున చేర్చుకునేది కాంగ్రెస్ పార్టీనేనని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ అన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి తెలంగాణ రాష్ట్ర కలను సాకారం చేసింది సోనియమ్మేనని పేర్కొన్నారు. క్వాలిటీ విద్య, నైపుణ్యాలను పెంచుకోవాలని పిలుపునిచ్చారు. మెరుగైన వైద్య సేవలందించడానికే కల్వకుర్తి వంద పడకల ఆసుపత్రిని మంజూరు చేశామని ఎమ్మెల్యే కశిరెడ్డి కోరిక మేరకు కడ్తాల్, తలకొండపల్లిలకు 30పడకల ఆసుపత్రులను మంజూరు చేస్తున్నట్లు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ ప్రకటించారు. కల్వకుర్తి పట్టణంలోని సర్వే నెంబరు 99లో నాలుగెకరాల 15గుంటల భూమిలో నిర్మించే వంద పడకల ఆసుపత్రికి కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ, రోడ్ల భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి, కలెక్టర్ బదావత్ సంతోష్ శంకుస్థాపన చేశారు. అనంతరం 99సర్వే నెంబరులో ఎమ్మెల్యే అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో మంత్రి రాజనరసింహ మాట్లాడుతూ నాయకులకు సేవ చేసే గుణం ఉండాలని అది కల్వకుర్తి ఎమ్మెల్యేకు పుష్కలంగా ఉందన్నారు. ఎన్నో ఏళ్లుగా హామీలకే పరిమితమైన బీసీలకు 42శాతం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు, ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో జరిగిందన్నారు.

టూరిజం శాఖ నుంచి రూ.5కోట్లు : జూపల్లి

దేశానికి, రాష్ట్రానికి శ్రీరామ రక్ష కాంగ్రెస్ పార్టీనేనని రాష్ట్ర ఎక్సైజ్ టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. సాంకేతికతను, నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. టూరిజం శాఖ నుంచి కల్వకుర్తి నియోజకవర్గానికి రూ.5కోట్లు మంజూరు చేస్తున్నట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రకటించారు. కల్వకుర్తి అభివృద్ధికి తన పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు.

మళ్లీ కాంగ్రెస్‌దే అధికారం: కోమటిరెడ్డి

రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రజాపాలనలో అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని, రాష్ట్రంలో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని రోడ్ల భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి రోడ్ల మంజూరు చేయాలని కోరిన రోడ్లన్నింటినీ తాను మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు.

చెప్పడం కాదు చేసి చూపిస్తాం: కశిరెడ్డి

కల్వకుర్తి నియోజకవర్గం గత పాలకుల నిర్లక్ష్యం వల్లే వెనకబాటుకు గురైందని ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కల్వకుర్తి నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి పర్చడమే తన లక్ష్యంగా పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. 250కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసినట్లు తెలిపారు. తాను కోరిన పనులను మంజూరు చేసిన మంత్రులు దామోదర రాజనరసింహ, కోమటిరెడ్డి వెం కట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావులకు నియోజకవర్గ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. కల్వకుర్తి డీఎస్పీ సైరెడ్డి వెంకట్‌రెడ్డి, సీఐ నాగార్జునల ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు తీసుకున్నారు. అనంతరం 113 మహిళా సంఘాల సభ్యులకు 7కోట్ల 13లక్షల 30వేల రూపాయల రుణాల చెక్కులను మంత్రులు, ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మాజీ సభ్యులు ఠాకూర్ బాలాజీసింగ్, మాజీ సర్పంచ్ బ్యాంగి ఆనంద్‌కుమార్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కాయితీ ఆశాదీప్‌రెడ్డి, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ సభ్యుడు జిల్లెల రాములు, మార్కెట్ కమిటీ చైర్మన్ మనీలా సంజీవ్‌కుమార్‌యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పసుల రమాకాంత్‌రెడ్డి, నాయకులు అశోక్‌రెడ్డి, భూపతిరెడ్డి, రాంరెడ్డి, ఆయిల్ల శ్రీనివాస్‌గౌడ్, రాజేష్‌రెడ్డి, చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి, రమాకాంత్‌రెడ్డి, జమ్ముల శ్రీకాంత్, చంద్రకాంత్‌రెడ్డి, రాహుల్, వెంకటేశ్, రవి, సురేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



:సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ

చాపకింద నీరులా..

● విస్తరిస్తున్న హెచ్‌ఐవీ...

(5వపేజీ తరువాయి)

జరిపేవారి సంఖ్య కూడా రోజు రోజుకు పెరుగుతున్నది. సెక్స్ వర్కర్లు దాదాపు 5వేల మంది ఉన్నట్లు తెలుస్తోంది.

● చనిపోయే వారు కూడా ఎక్కువే...

ఉమ్మడి జిల్లాలో హెచ్‌ఐవీతో చనిపోయే వారి సంఖ్య కూడా పెరుగుతోంది. మందులు సరిగ్గా వాడకపోవడం, నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో 2007 నుంచి ఇప్పటి వరకు 6,472 మంది చనిపోయారు. అవగాహన లోపం, సురక్షితం కాని లైంగిక సంబంధాలు కొనసాగించడం, మందులు సరిగ్గా వాడకపోవడం వల్లనే ఈ మరణాలు సంభవిస్తున్నాయి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో దాదాపు 8వేల మంది వరకు హెచ్‌ఐవీ బాధితులు ఏఆర్‌టీ మందులు వాడుతుండగా, మిగతా 2వేల మంది వరకు మందులు వాడటం లేదని అధికారులు భావిస్తున్నారు. వీరంతా సమాజానికి భయపడి వ్యాధిని నిర్ధారణ చేసుకోవడం లేదు. అంతేకాకుండా వ్యాధి ఉన్నప్పటికీ మందులు వాడకపోవడం, నిర్లక్ష్యం చేయడం వలన ప్రాణాలు కోల్పోతున్నారు. వాస్తవానికి సరైన సమయంలో ఏఆర్‌టీ మందులు వినియోగించడం వలన ఒక సాధారణ మనిషి లాగే జీవించవచ్చు. కానీ దానిపై అవగాహన లేకపోవడం, సమాజానికి భయపడి పరీక్షలు చేయించుకోకపోవడం వలన లోలోపలే కుమిలిపోయి అనారోగ్యం బారిన పడి చనిపోతున్నారు.

● హెచ్‌ఐవీ నియంత్రణపై దృష్టి ఏది?

హెచ్‌ఐవీ వ్యాధి నిర్మూలన, నియంత్రణ కోసం ప్రభుత్వం ఏమాత్రం దృష్టి సారించడం లేదు. గత రెండేళ్లుగా టీఎస్ సాక్స్ నుంచి ఎలాంటి బడ్జెట్ విడుదల కావడం లేదు. ప్రధానంగా ఏఆర్‌టీ కేంద్రాల్లో హెచ్‌ఐవీని గుర్తించే పరీక్షలు చేయడానికి అవసరమయ్యే కిట్లు అందుబాటులో లేవు. కనీసం సూది, దూదికి కూడా దిక్కులేని దుస్థితి నెలకొంది. అంతేకాకుండా 5 జిల్లాలకు కలిపి ఒక్కటే ఏఆర్‌టీ సెంటర్ ఉంది. అందులో కూడా సిబ్బంది కొరత కారణంగా అందరికీ కౌన్సెలింగ్ ఇచ్చే పరిస్థితి లేదు. ప్రతీ రోజు 200 నుంచి 300 మంది వరకు బాధితులు ఏఆర్‌టీ సెంటర్‌కు వస్తున్నారు. ఇదిలా ఉండగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో హెచ్‌ఐవీపై కళాజాతా ద్వారా గానీ, పోస్టర్లు, కరపత్రాల ద్వారాగానీ అవగాహన కల్పించడం లేదు. అందుకు అయ్యే ఖర్చులను కూడా ప్రభుత్వం మంజూరు చేయడం లేదు. దీంతో ఆయా జిల్లాల అధికారులు అవగాహన కార్యక్రమాలు చేయడానికి వెనకడుగు వేస్తున్నారు.



ఏఆర్‌టీ కేంద్రంలో మందుల కోసం నిలబడిన బాధితులు

జిల్లా పేరు	హెచ్‌ఐవీ బాధితులు	చనిపోయినవారు	మందులు వాడనివారు
మహబూబ్‌నగర్	3,020	2,154	126
గద్వాల్	1282	690	407
నాగర్‌కర్నూల్	2,291	1314	379
నారాయణపేట	1780	1280	279
వనపర్తి	1722	1034	124
మొత్తం	10,095	6,472	1315

డెంగీ వ్యాపిస్తే అధికారులపై చర్యలు

» కలెక్టర్ విజయేందిర బోయి హెచ్చరిక



ఇంటి యజమానులతో మాట్లాడుతున్న కలెక్టర్

దేవరకద్ర, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ కేంద్రంలో ఏ ఒక్క డెంగీ కేసు నమోదైనా సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ విజయేందిర బోయి హెచ్చరించారు. శుక్రవారం దేవరకద్ర మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో వైద్య సౌకర్యాలపై ఆరా తీశారు. ప్రతీ రోజు ఓపీ రోగులు ఎంత మంది వస్తున్నారని, అన్ని వసతులు ఉన్నాయా వైద్యాధికారి డాక్టర్ శరత్‌చంద్రను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మునిసిపాలిటీ కేంద్రాన్ని పర్యటించారు. ఇంటి సమీపంలో విపరీతంగా మొక్కలు, చెత్తాచెదారాలు, మురుగునీరు ఉండటంతో కమిషనర్‌పై, అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషనర్ ఇంటి యజమానులతో మాట్లాడి వారి ప్రాంగణంలో ఉన్న ముళ్ల చెట్లను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే ఇంటి యజమానులపై జరిమానా విధించాలన్నారు. ఎస్సీ కాలనీలో పర్యటించారు.

● పాఠశాల, కస్తూర్బా హాస్టల్ తనిఖీ..

మునిసిపాలిటీ పరిధిలోని మిన్గోనిపల్లిలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో 29 మంది విద్యార్థులు ఉండటంతో ఆరా తీశారు. ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారని, ఒకే తరగతి గది ఉండటంతో చాలా మంది విద్యార్థులు పాఠశాలకు రావడానికి ఇబ్బంది పడుతున్నారని వివరించారు. అనంతరం కస్తూర్బా పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. నాణ్యమైన భోజనం కూరగాయలను అందించాలన్నారు. తహసీలా ్దర్ కృష్ణయ్య, ఎంపీడీవో శ్రీనివాస్‌రావు, కమిషనర్ నరేష్‌బాబు, సీత్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌ల ఆకస్మిక తనిఖీ



పేట ఎంపీడీవో కార్యాలయం వద్ద 108 అంబులెన్స్‌ను తనిఖీ చేస్తున్న ఈఎంఆర్‌ఐ సంస్థ స్టోర్ అధికారి సత్యనారాయణ

నారాయణపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 108 అంబులెన్స్‌లు, 102 అమ్మ ఒడి అంబులెన్స్‌లు, 1962 మొబైల్ వెటర్నరీ అం బులెన్స్‌లను శుక్రవారం రాష్ట్ర ఈఎంఆర్‌ఐ సం స్థ స్టోర్ అధికారి సత్యనారాయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంబులెన్స్‌లలో ఉండే రికార్డులు, మందులు, పరికరాల పనితీరును ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ అంబులెన్స్‌లలో తగిన మందులు నిల్వ ఉంచు కోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రథమ చికిత్స చేసి మెరుగైన సేవలు అందించాలన్నారు.

అంబులెన్స్ సిబ్బందికి పలు సూచనలు చే శారు. కార్యక్రమంలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ రవికుమార్, పేట జిల్లా ఈఎంఆర్‌ఐ రాఘవేంద్ర, అంబు లెన్స్ సిబ్బంది ఉన్నారు.

రేషన్‌కార్డు పేరుతో డబ్బులు వసూలు

మానవపాడు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా రేషన్ కార్డులు జారీ చేసిందని ఓ ప్రవేటు వ్యక్తి డబ్బులు వసూలు చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. మండల పరిధిలోని కొర్విపాడులో నూతనంగా రేషన్ కార్డులు వచ్చాని గ్రామంలోని ఓ వ్యక్తి రేషన్‌కార్డు నెంబర్‌తో కార్డులు సృష్టించి ఒక కార్డును రూ.100నుంచి రూ.200 వరకు వసూలు చేసినట్లు తెలుస్తున్నది. ఇప్పటి వరకు 26 కార్డులకు వసూలు చేశాడని సమాచారం. దీని గురించి డీలర్ శ్రీనివాస్‌రావుతో ప్రస్తావించగా రేషన్ కార్డు నెంబర్‌తో ప్రింట్ ఇచ్చి నగదు వసూలు చేసిన మాట వాస్తవమన్నారు. అలాగే తహసీల్దార్ జ్యోతిశ్రీనివాస్ శర్మను వివరణ కోరగా ప్రభుత్వం నుంచి ఎలాంటి కార్డులు రాలేదన్నారు. కార్డులు ఇచ్చిన ఘటనపై విచారణ చేపడతామన్నారు.



డీలర్ తయారు చేసిన రేషన్‌కార్డును చూపుతున్న లబ్ధిదారుడు

క్రైం కార్నర్

బైక్‌ను ఢీకొట్టిన కారు: యువకుడి మృతి

మరికల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో యువకుడు మృతి చెందిన ఘటన నారాయణపేట జిల్లా మరికల్ మండలం తీలేరు గ్రామ స్టేజీ సమీపన గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. దేవరకద్ర మండలం నార్లోనికుంట గ్రామానికి చెందిన వడ్డే శివ(35), అత్తగారి ఊరైన మక్తల్ మండలం కాచ్వార్ గ్రామానికి తన బైక్‌పై బయలుదేరాడు. మరికల్ మండలం తీలేరు స్టేజీ సమీపన, నారాయణపేట వైపు నుంచి వస్తున్నా నాగర్‌కర్నూల్ చెందిన కారు అతివేగంతో బైక్‌ను ఢీకొంది. శివ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాములు తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

కోడేరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలంలోని మాచుపల్లి గ్రామంలో కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళ్లితే మాచుపల్లి గ్రామానికి చెందిన గొల్లపల్లి శేషయ్య(55) తమ కుటుంబంలో గొడవలు జరగడంతో కుమారులు వేర్వేరుగా ఉండాలని నిర్ణయించుకున్నారు. గురువారం తండ్రి శేషయ్య కలత చెంది మినుముల పంట కోసం తెచ్చి ఇంట్లో ఉంచిన పురుగు మందును తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శుక్రూఆరం పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుమారుడు శివరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జగదీశ్వర్ తెలిపారు.

విలియంకొండలో దివ్యాంగుడు..


అంజనేయులు (ఫైల్)

కొత్తకోట, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని విలియంకొండ గ్రామానికి చెందిన దివ్యాంగుడు అంజనేయులు (35) శుక్రవారం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ ఆనంద్ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

మేడిపూర్‌లో మరో వ్యక్తి..

తాడూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని మేడిపూర్ గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మల్లయ్య(45) గురువారం రాత్రి ఇంట్లో కుటుంబసభ్యుల మధ్య చిన్నపాటి గొడవ జరగడంతో మనస్తాపానికి గురైన ఇంట్లోనే ఉరి వేసుకున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో గమనించిన భార్య చరణ.. ఇంటి సమీపంలోని వారిని పిలిచి చూడగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. కాగా సోదరి బాలీశ్వరమ్మ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద స్థితి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గురుస్వామి తెలిపారు. అనంతరం మృతదేహాన్ని నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

దాడికి పాల్పడిన వ్యక్తికి జైలు శిక్ష

ఊట్కూర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : పాత కక్షలను మనసులో పెట్టుకుని బండరాయితో తలపై కొట్టి గాయపర్చిన వ్యక్తికి జైలు శిక్ష పడింది. వివరాల్లోకి వెళితే.. నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలోని పెద్ద జట్రం గ్రామానికి చెందిన నరసప్ప తన వ్యక్తిగత పని మీద 2016 మే 24న నారాయణపేటకు వెళ్లాడు. పని పూర్తి చేసుకుని ఓ హోటల్ వద్ద నిల్చున్నాడు. అదే గ్రామానికి చెందిన బూడిది రాములు పాత కక్షలను మనసులో పెట్టుకుని నరసప్ప హోటల్ వద్ద కనిపించడంతో కోపంతో బండరాయి తీసుకుని తలపై కొట్టాడు. దీంతో తలకు బలమైన గాయాలుగా బాధితుడు నారాయణపేట పోలీస్‌స్టేసన్‌లో ఫిర్యాదు చేశాడు. వాదోపవాదనలు విన్న నారాయణపేట జిల్లా కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ న్యాయాధికారి బి.సాయిమనోజ్ నిందితుడు రాములుకు ఏడాది జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

సిద్దోటం కార్యదర్శిపై దాడి: కేసు నమోదు

నవాబ్‌పేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న పంచాయతీ కార్యదర్శిపై ఓ వ్యక్తి దాడికి యత్నించడంతో పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని సిద్దోటం గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ విక్రం తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దోటం గ్రామ కార్యదర్శి మహేందర్ రెడ్డిపై గురువారం పంచాయతీ కార్యాలయంలో గ్రామానికి చెందిన ఈడ్గి రమేష్‌గౌడ్ వచ్చి పాల కేంద్రానికి అనుమతి ఇవ్వాలని కోరాడు. కొంచెం ఆగాలని కార్యదర్శి చెప్పగా, దూషించి దాడి చేశాడు. శుక్రవారం కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు రాజు, రాజేష్ దాడిని ఖండించారు.

రిటైర్డ్ వాచర్ మృతదేహానికి పోస్టుమార్టం

- ఎలుగుబంటి దాడిలో మృతి చెందినట్లుగా నిర్ధారణ

మన్ననూర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా నల్లమల ప్రాంతంలోని అప్పాపూర్ పెంటకు చెందిన రిటైర్డ్ ఫారెస్ట్ వాచర్ తోకల మల్లయ్య (65) అదృశ్యమై అడవిలో చెట్టు కింద విగతజీవిగా చెంచులకు గురువారం కనిపించాడు. లింగాల ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, డీఆర్‌వో రవికుమార్, సెక్షన్ అధికారి రాజు వైద్యాధికారితో కలిసి అడవిలో పర్యటించి తోకల మల్లయ్య మృతి చెంది స్థలానికి వెళ్లి పంచనామా చేశారు. 13 రోజుల క్రితం ఆయన మృతి చెందడంతో మృతదేహం కుళ్లిపోయింది. వైద్యులు పోస్టుమార్టం నిర్వహించి, గాయాలను బట్టి ఎలుగుబంటి దాడిలో మృతి చెందినట్లు నిర్ధారించారు. సహచర అటవీ ఉద్యోగులు, స్థానిక చెంచులు కన్నీటి పర్యంతమయ్యారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మూసాపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలంలోని 44వ జాతీయ రహదారి జానంపేట వద్ద బైక్‌ను కారు ఢీకొట్టిన ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఎం.వేణు తెలిపిన వివరాల ప్రకారం.. జానంపేట గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఎం.కృష్ణయ్య, ఎల్ల బాలస్వామి కలిసి బైక్‌పై చక్రపూర్ నుంచి జానంపేటకు వస్తున్నారు. పీహెచ్‌సీ వద్ద రోడ్డు క్రాసింగ్ అయి కొంత దూరం వెళ్లగానే అదే సమయంలో హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున కారు వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. దీంతో కృష్ణయ్య, ఎల్ల బాలస్వామికి తీవ్ర గాయాలు కాగా, చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు. కారు డ్రైవర్ అతివేగం, అజాగ్రత్తగా డ్రైవింగ్ చేయడంతోనే ప్రమాదం జరిగిందని విచారించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నల్లబెల్లం పట్టివేత: ఇద్దరిపై కేసు


పట్టుబడిన నల్లబెల్లంతో ఎక్సైజ్ శాఖ అధికారులు

కేటీదొడ్డి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా నల్లబెల్లం తరలిస్తున్న వాహనాన్ని ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకొని ఇద్దరుపై కేసు నమోదు చేసిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలంలో చోటు చేసుకుంది. ఎక్సైజ్ సీఐ గణపతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి మండలంలోని నందిన్నె చెక్‌పోస్ట్ వద్ద ఎక్సైజ్ సిబ్బంది వాహనాలను తనిఖీ చేస్తుండగా కర్ణాటకలోని రాయచూరు నుంచి కొల్లాపూర్‌కు ఆటోలో దాదాపు 60 బస్తాలలో 1,800 కేజీల నలబెల్లం తరలిస్తున్నట్లు గుర్తించారు. వాహనాన్ని స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించామన్నారు. అక్రమంగా నల్లబెల్లాన్ని తరలిస్తున్న డ్రైవర్ భగత్‌సింగ్ మరో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పాఠశాల క్రీడలకు సన్నాహాలు

- షెడ్యూల్ విడుదల చేసిన ఎస్‌జీఎఫ్
- ఆగస్టు, సెప్టెంబర్‌లో జట్ల ఎంపికలు
- పాఠశాల, కళాశాల స్థాయిలో పోటీలు


జనవరిలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్-17 జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీ ప్రారంభంలో అధికారులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) క్రీడా పోటీల నిర్వహణకు ముందడుగుపడింది. 2025-26 సంవత్సరానికి సంబంధించి పోటీలను నిర్వహించే తేదీలను ఇటీవల రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ నుంచి జిల్లాలకు ఆదే శాలు జారీ అయ్యాయి. డీఈవోల ఆధ్వర్యంలో ఎస్‌జీ ఎఫ్ కార్యదర్శులు, వ్యాయమ ఉపాధ్యాయులతో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించనున్నారు. పాఠశాల, క ళాశాల స్థాయిలో అండర్-14, 17, 19 విభాగాల్లో బాల, బాలికలకు వేర్వేరుగా మండల, జిల్లా, ఉమ్మడి జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించి జట్లను ఎంపిక చేయనున్నారు. పాఠశాల క్రీడల షెడ్యూల్ విడుదల కావడంతో క్రీడాకారుల్లో ఉత్సాహం నెలకొంది.

ఆగస్టు, సెప్టెంబరులో ఎంపికలు

ఈ ఏడాది స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడాపోటీల నిర్వహణ ఆగస్టు మొదటి వారంలో ప్రారంభం కానుంది. మండల స్థాయి పోటీలను ఆగస్టు మొదటి, రెండో వారంలో, జిల్లా స్థాయి పోటీలు ఆగస్టు మూడో వారంలో, ఉమ్మడి జిల్లా ఎంపికలు సెప్టెంబరు రెండో వారంలో నిర్వహించనున్నారు. సెప్టెంబర్ నాలుగో వారంలో తెలంగాణ పాత పది జిల్లాల జట్లతో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఉమ్మడి జిల్లా జట్లను సిద్ధం చేస్తారు. ఉమ్మడి జిల్లా నుంచి ఒక జట్టు పాల్గొంటే అం దులో 12 మంది ఉంటారు. ఒక్కో జిల్లా నుంచి ఇద్దరు లేదా ముగ్గురికి చోటు దక్కుతుంది. ఎస్‌జీఎఫ్ పోటీ లకు క్రీడాకారులు సిద్ధమవుతుండగా, క్రీడలను పారద ర్శకంగా నిర్వహించేందుకు ఆయా జిల్లాల్లో డీఈవోల తో పాటు ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

గతేడాది జాతీయ స్థాయికి వంద మంది..

2024-25 విద్యా సంవత్సరంలో ఉమ్మడి జిల్లాలో రెండు జాతీయస్థాయి, పది రాష్ట్రస్థాయి టోర్నీలు నిర్వ హించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఒక జాతీయ, మూడు రాష్ట్రస్థాయి టోర్నీలు, నారాయణపేటలో ఒక జాతీయ, ఒక రాష్ట్రస్థాయి టోర్నీ నిర్వహించారు. రాష్ట్ర స్థాయిలో వనపర్తిలో రెండు, జోగుళాంబ గద్వాలలో మూడు, నాగర్‌కర్నూల్ లో ఒక టోర్నీ నిర్వహించగా, వంద మంది జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని సత్తాచాటారు.

పకడ్బందీగా నిర్వహిస్తాం



స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) క్రీడా పోటీల నిర్వహణ పారదర్శకంగా నిర్వహిస్తాం. పోటీలను నిర్వహించే తేదీలను ఇటీవల రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ నుంచి జిల్లాలకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఎస్‌జీఎఫ్ సెక్రటరీ, వ్యాయమ ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేస్తాం. ఆగస్టు, సెప్టెంబరులో మండల, జిల్లా, ఉమ్మడి జిల్లా పోటీల నిర్వహణ, ఎంపికలు పూర్తి చేస్తాం.

-ఏ.ప్రవీణ్‌కుమార్, ఎస్‌జీఎఫ్ జిల్లా అధ్యక్షుడు, మహబూబ్‌నగర్

చేనేత కార్మికులకు ప్రత్యేక శిక్షణ

- వృత్తిలో నైపుణ్యంతో పాటు సాంకేతికంగా అభివృద్ధి చెందేలా చర్యలు
- జిల్లా పరిశ్రమలశాఖ మేనేజర్ రామలింగేశ్వరగౌడ్


మాట్లాడుతున్న జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ రామలింగేశ్వరగౌడ్

గద్వాల న్యూటౌన్, జులై 11 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు వృత్తిలో నైపుణ్యంతో పాటు సాంకేతికంగా అభివృద్ధి చెందేలా శిక్షణ కార్యక్రమాలను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు జిల్లా పరిశ్రమలశాఖ మేనేజర్ రామలింగేశ్వరగౌడ్ తెలిపారు. శుక్రవారం ఐడీవోసీ సమావేశ మందిరంలో ప్రస్తుత తరానికి తగ్గట్టుగా చేనేతలో రావాల్సిన మార్పుల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గద్వాల చేనేత చీరలకు ఉన్న డిమాండ్‌ను అనుసరించి ఇంకా సరికొత్త సాంకేతికను అందిపుచ్చుకోవడానికి, మార్కెటింగ్ నైపుణ్యాలు మెరుగుపరుచుకోవడానికి ర్యాంప్ పథకం ద్వారా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రైమ్ మినిస్టర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ వంటి పథకాలు చేనేత కార్మికులకు వర్తింపుజేసేందుకు పరిశ్రమలశాఖ నుంచి కృషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా చేనేత, జౌళిశాఖ ఏడీ గోవిందయ్య మాట్లాడుతూ.. గద్వాల చేనేత చీరలకు 2010లో భౌగోళిక గుర్తింపు లభించగా, విదేశాల్లోనూ గద్వాల బ్రాండ్‌ను విస్తృతంగా ప్రచారం చేసేందుకు ర్యాంపు కార్యక్రమం దోహదపడుతుందన్నారు. అనంతరం పలువురు చేనేత సంఘ ప్రతినిధులు గద్వాల చీరల మార్కెటింగ్‌లో ఉన్న ఇబ్బందులు, ప్రభుత్వం నుంచి అందాల్సిన సహకారం తదితర అంశాలపై తమ అభిప్రాయాలను తెలిపారు. కార్యక్రమంలో జిల్లా లీడ్‌బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్, జిల్లా స్కిల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ శ్రీనివాసులు నాయక్, ర్యాంపు ప్రతినిధులు బాలకృష్ణ, గీతాశ్రీ, హేమ, శ్రీదేవి, చేనేత ప్రతినిధులు అక్కల శ్రీనివాసులు, గణప గోవిందరావు, శాంతారాం తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్ సమగ్రాభివృద్ధే ప్రధాన లక్ష్యం

- కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి


మద్దూర్ మండలం నాగిరెడ్డిపల్లి - చింతల్‌గట్టుతండా రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న నాయకులు

మద్దూర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ నియోజకవర్గ సమగ్రాభివృద్ధే ప్రధాన లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి తెలిపారు. రూ.3.51 కోట్లతో నాగిరెడ్డిపల్లి నుంచి వయా సిద్ధేశ్వర ఆలయం - చింతల్‌గట్టు వరకు, రూ. 6కోట్లతో పెదిరిపాడ్ నుంచి దేశాయిపల్లి వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు, మద్దూర్ పోలీస్‌స్టేషన్ ప్రహరీ గోడ నిర్మాణానికి కాడా అధికారి వెంకట్‌రెడ్డితో కలిసి శుక్రవారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాబోయే రెండేళ్లల్లో నియోజకవర్గ రూపురేఖలు మారడం ఖాయమన్నారు. కొడంగల్‌ను ఆదర్శ నియోజకర్గంగా తీర్చిదిద్దేంకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.వెయ్యి కోట్ల నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. రాజకీయాలకు తావు లేకుండా అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు.

మార్కెట్ రోడ్డు కుదించాలని వినతి

మద్దూర్- చింతల్‌దిన్నె రోడ్డు అభివృద్ధిలో భాగంగా మద్దూర్ మార్కెట్ లైన్ రోడ్డును 70పీట్లకు వేసిన మార్కింగ్‌పై 30 పీట్లకు కుదించాలని తిరుపతిరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. దీనికి ఆయన స్పందిస్తూ సంబంధిత అధికారులు, స్థానిక నాయకులతో చర్చించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. నర్సింహ, రఘుపతిరెడ్డి, సంజీవ్, నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏటీఎం దొంగలను పట్టుకున్న పోలీసులు

- ముంబయిలోని గణేష్ గ్రూపునకు చెందిన వారిగా గుర్తింపు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ చంద్రశేఖర్

భూత్పూర్, జూలై 11(ఆంధ్రజ్యోతి): అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుని ఏటీఎం కార్డులను ఏమార్చి డబ్బులు డ్రా చేస్తున్న వ్యక్తులను పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ చంద్రశేఖర్ శుక్రవారం వివరాలను వెల్లడించారు. ఈ నెల 5 వ తేదీన మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్‌కు చెందిన బత్తుల అనిల్ కుమార్ చౌరస్తాలో ఉన్న ఏటీఎం మిషన్ నుంచి డబ్బులు డ్రా చేయడానికి వెళ్లాడు. అక్కడే కాపు కాచి ఉన్న కొంత మంది ఏటీఎం క్యాబిన్ లోకి వచ్చారు. డబ్బులు డ్రా చేస్తున్నట్లుగా నటించి అతని వద్ద ఉన్న అసలు ఏటీఎం కార్డును మార్చి, అదే ప్రాంతంలో ఉన్న మరో బ్యాంకు ఏటీఎం లో రూ.40వేలు డ్రా చేసుకొని వెళ్లి పోయారు. అయితే డబ్బులు డ్రా అయినట్లుగా బత్తుల అనిల్‌కుమార్‌కు ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శుక్రవారం అదే ఏటీఎం వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న వారిని వాకాబు చేసే క్రమంలో దొంగ పారిపోతుండగా పోలీసులు పట్టుకున్నారు. అతన్ని విచారించగా మహారాష్ట్రకు చెందిన రోహిత్, ఓం శంకర్, మధుకర్ శర్మ, రోహిత్ శర్మ, ముకేష్ సంతోష్‌నాగేంద్ర, ఏటీఎం దొంగలుగా తేలింది. రోహిత్, ఓం శంకర్ పట్టుబడగా, మిగతా వారు పరారీలో ఉన్నట్లు తెలిపారు. వీరు జూన్ 30వ తేదీన ముంబాయి నుంచి కారులో వచ్చి జహీరాబాద్, నిర్మల్, హైదరాబాద్, భూత్పూర్ ప్రాంతాల్లో ఏటీఎంల వద్ద ప్రజలను మోసం చేస్తూ డబ్బులు డ్రా చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ముంబయిలోని గణేష్‌బాల్చంద్ లోఢ్తే అలియాస్ గణేష్ గ్రూపునకు చెందిన ముఠాగా పోలీసుల విచారణలో తేలింది. కారు, ఫేక్ ఏటీఎం కార్డులు, నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పురిటినొప్పులతో వెళ్తే ఉసురు తీశారు

- వైద్యుల కోసం ఆరు గంటలు ఎదురుచూపు
- అర్ధరాత్రి పురుడుపోసిన స్టాఫ్ నర్సు
- శిశువుకు విషమంగా ఉన్నదంటే 'గాంధీ'కి తరలింపు
- వైద్యులు పరీక్షించి చనిపోయినట్లు నిర్ధారణ
- మల్లాపూర్ పీహెచ్‌సీ ఎదుట బాధితుల ఆందోళన


యూపీహెచ్‌సీ ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

మల్లాపూర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పురిటి నొప్పులతో సర్కారు ఆస్పత్రికి వెళితే ఆరుగంటలైనా వైద్యులు రాకపోవడంతో నవజాత శిశువు మృతి చెందిన ఘటన మల్లాపూర్ పీహెచ్‌సీలో శుక్రవారం చోటు చేసుకుంది. నాగర్‌కర్నూల్ జిల్లా, వడ్డేమాను గ్రామానికి చెందిన శివ, కవిత దంపతులు శక్తిసాయినగర్‌లో నివసిస్తున్నారు. గర్భవతి అయినప్పటి నుంచి కవిత యూపీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేయించుకొని మందులు వాడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటలకు ఆమెకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. స్టాఫ్ నర్సు ఒక్కరే ఉండటంతో మరో ఆస్పత్రికి తీసుకెళ్తామంటే ఇబ్బంది లేదని, సాధారణ ప్రసవం చేస్తానని రెండు ఇంజక్షన్లు ఇచ్చి వాకింగ్ చేయమని చెప్పింది. అర్ధరాత్రి తర్వాత ఆపరేషన్ గదిలోకి తీసుకెళ్లి ఆడబిడ్డకు జన్మనిచ్చిందని, మూడు కిలోల బరువు ఉందని, పరిస్థితి విషమంగా ఉందని గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించింది. అంబులెన్స్‌లో గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి మృతి చెందిన శిశువును ఎందుకు తీసుకొచ్చారని అనడంతో ఆందోళన చెందారు. తల్లి రక్తస్రావంలో ఉండటంతో కుట్లు సైతం వేయలేదని గ్రహించి గాంధీ ఆస్పత్రి సిబ్బంది కుట్లు వేసి పంపించారు. అక్కడి నుంచి మల్లాపూర్ యూపీహెచ్‌సీకి చేరుకొని వైద్యుల నిర్లక్ష్యం వల్లే శిశువు మృతి చెందిందని ఆందోళన చేశారు. నాచారం పోలీసులు బాధితుల నుంచి ఫిర్యాదు తీసుకున్నారు.

ఉమ్మ నీరు మింగడంతోనే..: డాక్టర్ వినోద్

ఉమ్మనీరు మింగడంతోనే నవజాత శిశువు చనిపోయింది. సిబ్బంది సీపీఆర్ చేసినా కాపాడలేకపోయాం. ప్రాణాలు కాపాడటానికి అన్ని ప్రయత్నాలు చేశాం.

10 యూనిట్ల ద్వారా జల విద్యుదుత్పత్తి

ఆత్మకూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ఎగువ, దిగువ జల విద్యుదుత్పత్తి కేంద్రాలలో 10 యూనిట్ల ద్వారా ఉత్పత్తిని కొనసాగిస్తున్నట్లు ఎస్ఈ శ్రీధర్ శుక్రవారం తెలిపారు. ఎగువన జల విద్యుదుత్పత్తి కేంద్రంలో ఐదు యూనిట్ల ద్వారా 3.227 మిలియన్ యూనిట్లు, దిగువ కేంద్రంలో ఆరు యూనిట్లు ఉండగా 5 యూనిట్లను ప్రారంభించి 24 గంటల్లో 3.480 మిలియన్ యూనిట్ల ఉత్పత్తిని రాబట్టినట్లు తెలిపారు. వరద ఉధృతి ఎక్కువగా ఉన్నందున దిగువ జూరాలలో ఐదు యూనిట్లనే ప్రారంభించినట్లు పేర్కొన్నారు.

నిధుల స్వాహాపై ఐకేపీ అధికారుల విచారణ

- కాజేసిన డబ్బులను చెల్లిస్తానని చెప్పిన వీవోఏ


ఎర్రవల్లి మండలం జింకలపల్లిలో విచారణ చేస్తున్న ఐకేపీ ఏపీఎం కురుమన్న, సంఘం సభ్యులు

ఎర్రవల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలంలోని జింకలపల్లి గ్రామంలో వీవోఏ రాధమ్మ నిధులు స్వాహా చేసిన ఘటనపై శుక్రవారం ఐకేపీ అధికారులు గ్రామంలో విచారణ చేపట్టారు. ఇందిరా మహిళా సంఘం నుంచి సభ్యులకు తెలియకుండా 14 సంఘాల నిర్వహణ చూసే వీవోఏ రాధమ్మ రూ.1.50లక్షల రుణాన్ని గుట్టుచప్పుడు కాకుండా స్వాహా చేసింది. ఈ అంశంపై గురువారం ఆంధ్రజ్యోతిలో 'రాంగ్‌రూట్‌లో రుణం' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు సంఘ సభ్యులు, వీవోఏ, గ్రామ ఐక్య సంఘం అధ్యక్షురాలు తులశమ్మతో కలిసి గ్రామస్థుల సమక్షంలో విచారణ చేపట్టారు. తాను రూ.1.50లక్షలు తీసుకున్నానని, వీటిని తిరిగి చెల్లిస్తానని ఐకేపీ ఏపీఎం కురుమన్న సమక్షంలో చెప్పింది. ఈమె ఈ వ్యవహారానికి పాల్పడటంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి మోసానికి పాల్పడిన ఈమెను వీవోఏగా తప్పించాలని కోరారు.

అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టిన ట్రాక్టర్

మహబూబ్‌నగర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పాలమూరు నగరంలోని మహబూబ్‌నగర్ - రాయచూర్ ప్రధాన రహదారి సుభాష్‌చంద్రబోస్ చౌరస్తాలో సుందరీకరణ పనులలో భాగంగా ఏర్పాటు చేసిన మనిషి ఆకార ప్రతిమను ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఆ ప్రతిమ నేలకొరిగింది. శుక్రవారం ఉదయం 8:30 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిపై ట్రాక్టర్ అదుపు తప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లిన సమయంలో జనాలు, వాణాలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు చేరుకుని ట్రాక్టర్‌ను అక్కడినుంచి తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

భర్తను చంపిన కేసులో భార్యకు రిమాండ్

పెద్దమందడి, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలోని మద్దిగట్ల గ్రామంలో భర్తను హత్య చేసిన భార్య మణిగిళ్ల అలివేలును రిమాండ్‌కు పంపినట్లు సీఐ రాంబాబు శుక్రవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. మద్దిగట్ల గ్రామానికి చెందిన కోటయ్య మద్యం తాగి భార్య అలివేలుతో తరచుగా గొడవ పడేవాడని తెలిపారు. గురువారం రాత్రి తాగి వచ్చి భార్యతో గొడవ పడగా, కోటయ్య తలపై కట్టెతో బలంగా కొట్టడం కింద పడిపోయాడని, మళ్లీ గోడకు కొట్టడంతో మృతి చెందాడు. విషయం దాచి పెట్టే ప్రయత్నం చేసిందని చెప్పారు. మృతుని అక్క రాములమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా భార్య నిందితురాలి నిర్ధారణ అయ్యిందని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రిమాండ్ పంపినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్‌ఐ శివకుమార్, ట్రైనింగ్ ఎస్‌ఐ దివ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న రైతులు

హన్వాడ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలంలోని వేపూర్ గ్రామం వాగు నుంచి ఇసుకను తీసుకెళ్లొద్దని గ్రామస్థులు శుక్రవారం ట్రాక్టర్లను అడ్డుకున్నారు. ఇసుకను తరలిస్తే బోర్లలో నీరు ఇంకుతుందని, మా ఇసుక మాకే కావాలని మరికొందరు రైతులు అడ్డుకున్నారు. అయితే రెవెన్యూ అధికారులు అనుమతి ఇచ్చారని, మేము తీసుకెళ్తామని చెప్పి ట్రాక్టర్లను కదిలిస్తుండగా డ్రైవర్లతో వాగ్వావాదానికి దిగారు. పోలీసులు అక్కడికి చేరుకొని అనుమతి ఉన్నందున అడ్డుకోరాదని సూచించారు. ఇసుకను తీసుకెళ్లకుండా అధికారులకు ఫిర్యాదు చేయాలని వివరించారు.

ఇంటర్వ్యూ..

హరితహారం లక్ష్యాలను పూర్తి చేస్తాం

● తిరుపతన్న, ఎంపీడీవో



ఉండవల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో హరితహారం లక్ష్యాలను పూర్తి చేసేందుకు పకడ్బందీగా కార్యాచరణ రూపొందిస్తున్నాం. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, పింఛన్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో తిరుపతన్న 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో తెలిపారు.

మండలంలో ఎన్ని మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు?

ఈ ఏడాది మండలంలో 62వేల మొక్కలు నాటేందుకు లక్ష్యం పెట్టుకున్నాం. ఇప్పటి వరకు ఐదువేల గుంతలు తవ్వారు. 2,500 మొక్కలు నాటారు.

గత ఏడాది నాటిన మొక్కలు నేటికీ ఉన్నాయా?

గత ఏడాది 34 వేల మొక్కలు నాటాము. వాటిలో 91శాతం మొక్కలు జీవించాయి. కొన్నిచోట్ల రైతులు సహకరించలేదు.

మండలంలో ఇందిరమ్మ ఇళ్లు ఎన్ని మంజూరయ్యాయి? ఎన్ని నిర్మించారు?

ఇప్పటివరకు మండలంలో 211 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. ఐదు ఇళ్లకు బేస్‌మెంట్ నిర్మించారు.

పింఛన్ల మంజూరులో జాప్యం ఎందుకు జరుగుతున్నది?

ప్రభుత్వం నుంచి డబ్బులు విడుదలైన వెంటనే బ్యాంకులు, పోస్టాఫీసుల ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నాం. గ్రామాల్లో సచివాలయ సిబ్బందితో పెన్షన్‌దారులకు అవగాహన కల్పిస్తున్నాం.

న్యూస్ బాక్స్

ట్రాన్స్‌జెండర్ల నైపుణ్య శిక్షణ కోసం దరఖాస్తుల ఆహ్వానం

● జిల్లా సంక్షేమాధికారి సునంద

గద్వాలన్యూటౌన్,జూలై 11(ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలో ట్రాన్స్‌జెండర్ల నైపుణ్య శిక్షణ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి సునంద శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో నిరుద్యోగులైన ట్రాన్స్‌జెండర్లకు ప్రైవేట్ సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పించాలని, స్వయం ఉపాధి పొందేలా వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణ అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అర్హులైన వారు జూలై 23వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా అభ్యర్థులకు డ్రైవింగ్, ఫొటోగ్రఫీ-వీడియోగ్రఫీ, బ్యూటీషియన్, జ్యూట్‌బాగ్ టైలరింగ్, లాజిస్టిక్స్ రంగాల్లో నైపుణ్య శిక్షణ అందించనున్నారు. ఆసక్తిగల ట్రాన్స్‌జెండర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చాకలి ఐలమ్మ విగ్రహం ఆవిష్కరణ

మానవపాడు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బోరవెల్లిలో ఎలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ విగ్రహాన్ని శుక్రవారం గ్రామ రజక సంఘం ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంలో ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రజకసంఘం నాయకులు, మహిళలు ఉన్నారు.

వాసవీ మాతకు ప్రత్యేక పూజలు

మల్దకల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఆషాఢమాసం శుక్రవారం సందర్భంగా మల్దకల్‌లోని శ్రీ వాసవీ మాత ఆలయంలో అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజులు చేశారు. ఈసందర్భంగా అమ్మవారికి మల్దకల్, గట్టు మండలాల నుంచి ఆర్యవైశ్యులు ఒడిబియ్యం, సారె సమర్పించారు. కుంకుమార్చన, పల్లకీ, ఉయ్యాలసేవ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల అర్బన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): 33కేవీ బిజ్వారం ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్లకు తాకే చెట్లకొమ్మలను తొలగిస్తున్నందున ఈనెల 12వ తేదీ శనివారం మధ్యాహ్నం 12గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అంతర కృషితో అధిక దిగుబడులు

● డీఏవో సక్రియా నాయక్

ఉండవల్లి/ అలంపూర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : పంటల సాగులో అంతర కృషి వల్ల అధిక దిగుబడులు వచ్చి లాభదాయకంగా ఉంటుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియా నాయక్ రైతులకు సూచించారు. శుక్రవారం ఉండవల్లి మండలం మారమునగాల, తక్కశిల, కంచుపాడు, ఉండవల్లిలో డీఏవో పర్యటించారు. పత్తి, మొక్కజొన్న, కంది పంట పెరుగుదలను పరిశీలించారు.

ఎరువుల దుకాణం తనిఖీ

అలంపూర్ : ఈ వానాకాలం సీజన్‌కి ఎరువుల విషయంలో రైతుకు ఎలాంటి కొరత ఉండదని జిల్లా వ్యవసాయ అధికారి సక్రియా నాయక్ అన్నారు. అలంపూర్ పట్టణ కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రంలో శుక్రవారం ఎరువుల తనిఖీ చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మెన్ మోహన్‌రెడ్డి, ఏవో నాగార్జునరెడ్డి, సీఈవో శ్రీనివాసులు, కేశవరెడ్డి, విస్తరణ అధికారి సాయిరాం రైతులు తదితరులు పాల్గొన్నారు.



రాజోలి రోడ్డులో మలుపుల వద్ద వాహనాలు కనిపించకుండా ఉన్న కంపచెట్లు



రాజోలి, తుమ్మిళ్ల రహదారిని కమ్మేసిన కంపచెట్లు

రోడ్లను కమ్మేసిన కంపచెట్లు

● ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలు

● సూచికల ఏర్పాటు మరిచిన అధికారులు

రాజోలి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పల్లెపల్లెకు రహదారులు అంటూ.. అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం కోట్ల రూపాయల వ్యయంతో బీటీ రహదారులు నిర్మిస్తున్నా.. రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంపచెట్లు తొలగించకపోవడంతో ప్రయాణికులు తరచుగా ప్రమాదానికి గురవుతున్నారు. రాజోలి మండలంలోని తుమ్మిళ్ల నుంచి రాజోలి వరకు వయా తూర్పు గార్లపాడు మీదుగా ఏర్పాటు చేసిన బీటీ రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు ఏపుగా పెరిగి రహదారిని కమ్మేస్తున్నాయి. దీని వల్ల ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించే లోపు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇటీవల పలువురు గాయాలతో బయటపడ్డవారు కొందరైతే.. ప్రమాదంలో మరణించిన వారి సంఖ్య కూడా నమోదు అయినట్లు పోలీస్ రికార్డుల్లో కనిపిస్తున్నాయి. దీనికితోడుగా ప్రమాదకరమైన మలుపులు, ఏపుగా పెరిగిన కంపచెట్లు ద్వారా తరచూ ప్రమాదాలు జరుగుతున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు తెలుపుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, ప్రమాదాలకు నిలయంగా మారిన బీటీ రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లను తొలగించే చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా మలుపులు ఎక్కువగా ఉన్న చోట సూచికలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కంపచెట్లను తొలగించాలి

తుమ్మిళ్ల నుంచి తూర్పు గార్లపాడు, రాజోలి వరకు ఏడు కిలోమీటర్ల బీటీ రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లను తొలగించాలి. మలుపుల వద్ద సూచికబోర్డులు ఏర్పాటు చేయాలి. రోడ్డు మలుపుల వద్ద ఎదురురుగా వాహనాలు కనిపిస్తే ప్రమాదాలు జరుగవు.

- కె.శ్రీకాంత్, రాజోలి

భయంభయంగా ప్రయాణం

ప్రతీరోజు ముండ్లదిన్నె గ్రామం నుంచి మండల కేంద్రం రాజోలికి ద్విచక్ర వాహనాలపై వస్తుంటారు. రోడ్డుకు ఇరువైపులా పెరిగిన ముళ్లకంపతో భయంభయంగా రాకపోకలు సాగిస్తున్నారు. పలువాహనాలు ప్రమాదానికి గురయ్యాయి. సంబంధిత అధికారులు స్పందించి, ముళ్లకంపను తొలగించాలి.

- ఏసన్న, తుమ్మిళ్ల

ఓపెన్ టెన్త్, ఇంటర్ కోర్సుల్లో ప్రవేశాల పోస్టర్ విడుదల



పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్, అధికారులు

గద్వాల న్యూటౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ బీఎం సంతోష్ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో ఇందుకు సంబంధించి పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఓపెన్ స్కూల్ సర్టిఫికెట్, రెగ్యులర్ సర్టిఫికెట్‌కు సమానమని అన్నారు. ఉద్యోగం చేస్తున్న యువత, వివాహిత మహిళలు విద్యాభ్యాసం మధ్యలో ఆగిపోయిన వారు, గృహిణులు, వయోజనులు, సామాజికంగా వెనుకబడిన వర్గాల వారు తమ విద్యను కొనసాగించేందుకు అవకాశం ఉందన్నారు. పదవ తరగతి కోసం కనీసం 14 సంవత్సరాలు, ఇంటర్ కోసం 16 సంవత్సరాలు పైబడిన వారు అర్హులన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఈవో అబ్దుల్ గని, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి హృదయరాజు, జిల్లా సంక్షేమాధికారి సునంద, జిల్లా ఉపాధి కల్పనాధికారి డాక్టర్ ప్రియాంక ఉన్నారు.

మానిటరింగ్ సభ్యుల సూచనలు పరిగణలోకి తీసుకుంటాం

జిల్లాఅభివృద్ధికి సంబంధించి జాతీయ స్థాయి మానిటరింగ్ సభ్యులు చేసిన సూచనలు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయని, వాటిని పరిగణలోకి తీసుకొని తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. శుక్రవారం ఐడీవోసీలోని తన ఛాంబర్‌లో కేంద్రగ్రామీణ అభివృద్ధి శాఖ తరపున జిల్లాలో పర్యటించిన సభ్యులు సి.వి. బాలమురళి, ఆర్.రాధిక జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జాతీయస్థాయి మానిటరింగ్ సభ్యులు ఇటీవల పలుగ్రామాల్లో క్షేత్రస్థాయి పర్యటన చేశారు. ఉపాధిహామీ, స్వచ్ఛభారత్ మిషన్, పక్కాఇళ్ల నిర్మాణం, నీటివసతి, మౌలిక వసతులు అభివృద్ధి వంటి పథకాల అమలు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించి, ఫలితాలను అందించేందుకు యంత్రాంగం పనిచేస్తుందన్నారు. సభ్యుల సూచనలు విలువైనవని, పరిగణలోని తీసుకుంటామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు ఉన్నారు.

భూభారతి పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలి

పెండింగ్‌లో ఉన్న భూభారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీవోసీ కాన్ఫరెన్స్ హాలులో భూభారతి, రేషన్‌కార్డుల ధ్రువీకరణ, మీసేవ దరఖాస్తులపై అన్ని మండలాల తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. భూమి వివాదాలు తగ్గి, రైతులకు, భూయజమానులకు శాశ్వత న్యాయం జరిగేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రెవెన్యూ సదస్సుల్లో అందిన దరఖాస్తులను పరిశీలించి, పరిష్కరించాలని ఆదేశించారు. అసైన్‌మెంట్ భూముల సమస్యలను పూర్తిగా పరిశీలించి నివేదిక ఇవ్వాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, డీఎస్‌వో స్వామికుమార్, సర్వే ల్యాండ్ రికార్డు ఏడీ రామ్‌చందర్, అన్ని మండలాల తహసీల్దార్లు ఉన్నారు.

పకడ్బందీగా ముఖగుర్తింపు హాజరు నమోదు

ధరూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): సాంకేతికలను సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ముఖ గుర్తింపు హాజరు పకడ్బందీగా నమోదు చేయాలని జిల్లా ఏపీవో, టెక్నికల్ పర్సన్స్ శ్రీనివాసులు, శివకృష్ణ సూచించారు. జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు శుక్రవారం ధరూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ముఖగుర్తింపుపై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యంగా జిల్లా టెక్నికల్ టీంఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు ముఖగుర్తింపు హాజరులో ఎదురయ్యే సమస్యలను ఏమిటి, వాటిని ఎలా పరిష్కరించాలని అనే అంశంపై ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, మండల కేంద్రంలోని ప్రధానోపాధ్యాయులకు వివరించారు. విద్యార్థుల రిజిస్ట్రేషన్‌లో విద్యార్థుల ముఖం క్లియర్‌గా ఉంటే అటెండెన్స్ ఎక్కువ సేపు పట్టదని, అలాగే ఒకేసారి అందరినీ యాప్‌లో గ్రూప్ హాజరు నమోదు చేసే అవకాశం ఉందన్నారు. విద్యార్థుల ముఖ కవళికలను ఎలా ఫొటోలు తీయాలన్న అంశంపై వివరించారు. సమావేశంలో డీసీఈబీ సెక్రటరీ ప్రతాప్‌రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి రవీంద్రబాబు, జిల్లా ఏపీవో, టెక్నికల్ పర్సన్స్ శ్రీనివాసులు, శివకృష్ణ, సీఆర్పీ నర్సింహ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాటిన మొక్కలను సంరక్షించాలి

▸▸ మారమునగాలలో పర్యటించిన అదనపు కలెక్టర్ నర్సింగరావు

ఉండవల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారమునగాల-2 గ్రామంలో శుక్రవారం అదనపు కలెక్టర్ నర్సింగరావు పర్యటించారు. ఈసందర్భంగా గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం స్థానిక పాఠశాల వద్ద విద్యార్థులతో కలిసి మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులు తమకు ఎదురవుతున్న సమస్యలను అదనపు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. పాఠశాల భవన పరిస్థితి, మౌలిక వసతుల కొరత తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో, అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్, టెక్నికల్ అసిస్టెంట్, ఇతర అధికారులు ఉన్నారు.

బింగిదొడ్డిలో పాఠశాల భవనం పూర్తి చేయాలి

▸▸ మాట తప్పిన కాంట్రాక్టర్లు ఇప్పటికైనా స్పందించాలి

▸▸ బీజేపీ నాయకుల డిమాండ్

అయిజ టౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బింగిదొడ్డి గ్రామంలో అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. భారత్‌మాల నేషనల్ హైవే పనులు చేసే కాంట్రాక్టర్లు మూడేళ్ల క్రితం గ్రామంలోని పిల్లలకు పాఠశాలను నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ హామీతోనే గ్రామానికి చెందిన చెరువు నుంచి రూ.లక్షల విలువ చేసే మట్టిని రోడ్డు నిర్మాణానికి ఉపయోగించుకున్నారని వారు తెలిపారు. పాఠశాల నిర్మాణ పనులు మొదలై స్లాబ్ వేశారు తప్ప, ఇంకా పనులు పూర్తికాలేదని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత కాంట్రాక్టర్లు స్పందించి ఇచ్చిన మాట ప్రకారం గ్రామంలోని పిల్లలకు చదువుకునేందుకు పాఠశాల నిర్మాణం పూర్తి చేయాలని, లేకుంటే బీజేపీ తరపున పెద్ద ఎత్తున నిరసన చేసేందుకు సిద్ధపడనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గోపాలకృష్ణ, ప్రదీప్, లక్ష్మన్‌గౌడు, భీమన్న, లక్ష్మన్న, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రతిభతో కళాశాలకు గుర్తింపు తేవాలి

● ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా

గద్వాల టౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): విజ్ఞానశాస్త్రంలో మరింత ప్రతిభను చాటి కళాశాలకు, ప్రాంతానికి మంచిపేరు తేవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా విద్యార్థినులకు సూచించారు. స్థానిక మహారాణి ఆదిలక్ష్మీ దేవమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి జిజ్ఞాస స్టూడెంట్ స్టడీ ప్రాజెక్టు సందర్భంగా మ్యాథమెటిక్స్, ఫిజిక్స్ సబ్జెక్టులకు సంబంధించిన ప్రాజెక్టులు రాష్ట్రస్థాయిలో ఎంపికయ్యాయి. విద్యార్థులు తమ ప్రాజెక్టులను కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ హైదరాబాద్‌లో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

ఇందుకు సంబంధించిన సర్టిఫికెట్లను శుక్రవారం కళాశాలలో విద్యార్థులకు అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టుల డిపార్ట్‌మెంటల్ సూపర్‌వైజర్లు డాక్టర్ కె.సత్యన్న, ఏ.రాధికను అభినం దించిన ప్రిన్సిపాల్, భవిష్యత్‌లో మరిన్ని ప్రాజెక్టులను రూపొందించేలా విద్యార్థులను సమాయత్తం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సురేందర్‌రెడ్డి, డాక్టర్ వెంకటేశ్వరమ్మ, సత్యమ్మ ఉన్నారు.

ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీ

▸▸ జెండాఊపి ర్యాలీని ప్రారంభించిన డీఎంహెచ్‌వో సిద్దప్ప

గద్వాలన్యూటౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాకేంద్రంలో శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాత డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద ర్యాలీని డీఎంహెచ్‌వో డాక్టర్ సిద్దప్ప జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ పట్టణంలోని పాతబస్టాండ్ వరకు వెళ్లారు. అతిగా పెరుగుతున్న జనాభా, వనరుల కొరత, పర్యావరణ సమస్యలు, సామాజిక సవాళ్లపై ప్రజల్లో అవగాహన కల్పించడమే అన్నారు.కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్లు సంధ్యాకిరణ్మయి, రాజు, రిజ్వానా తన్వీర్, వైద్యసిబ్బంది ఉన్నారు.

జనాభా పెరిగితే మరిన్ని సమస్యలు

గట్టు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. గట్టు ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ర్యాలీ నిర్వహించారు. మండల వైద్యాధికారి టీకే. రమేష్ మాట్లాడుతూ ఏటా జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవం జరుపుకుంటారని, జనాభా పెరుగుదలతో పర్యావరణ సమస్యలు, వనరుల కొరత, లైంగిక సమానత్వ లోపాలు ఏర్పడతాయన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

గురుకులాల్లో సదుపాయాల కల్పనలో ప్రభుత్వం విఫలం

● బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య

ధరూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గురుకులాల్లో మౌలిక సదుపాయాలను కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య అన్నారు. శుక్రవారం మార్లబీడు వద్ద ఉన్న కేటిదొడ్డి మండల పూలే బాలుర గురుకుల పాఠశాలను పల్లయ్య సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు అయినా గురుకులాల్లో ఉన్న మౌలిక సదుపాయాలు కల్పించలేకపోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్ర మంలో మహదేవ్, యువరాజు, రమేష్ ఉన్నారు.

భోజనం నాణ్యతగా ఉండాలి

కేటీదొడ్డి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రతీరోజు విద్యార్థులకు మెను ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని మండల విద్యాధికారి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని కేటీదొడ్డి, నందిన్నె గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా రికార్డులను పరిశీలించి ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు.

శాంతిభద్రతల పర్యవేక్షణకు పాటుపడాలి

● ఎస్సీ, ఎస్టీ కేసులపై త్వరగా చర్యలు తీసుకోవాలి

● డీఎస్పీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఎస్పీ



డీఎస్పీ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల క్రైం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శాంతిభద్రతలు ప్రజలకు అందుతున్న పోలీసు సేవల నాణ్యతను పర్యవేక్షించేందుకు జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు శుక్రవారం జిల్లాకేంద్రంలోని డీఎస్పీ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్సీ, ఎస్టీ కేసులపై త్వరగా చర్యలు చేపట్టాలని, వివిధ కేసులకు సంబంధించి ప్లాన్ ఆఫ్ యాక్షన్ తీసుకోవాలన్నారు. వర్షాకాలం మొదలైనందున రైతులు పొలం పనుల్లో నిమగ్నమై ఉంటారని, ఆ సమయంలోనే నకిలీ విత్తనాల పంపిణీపై దృష్టి సారించాలన్నారు. వరకట్న వేధింపు కేసుల్లో త్వరగా యాక్షన్ తీసుకోవాలన్నారు. సైబర్ నేరాలు, మత్తు పదార్థాల వినియోగంపై ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. అనంతరం కార్యాలయ నిర్వహణ, దర్యాప్తు ప్రగతి, రిజిస్టర్లు, హాజరు పుస్తకాలు, ఫిర్యాదుల నమోదు తదితర అంశాలను పరిశీలించారు. అలాగే ప్రజలు ఫిర్యాదులపై తీసుకున్న చర్యలు, పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కార పరిస్థితులను సమీక్షిస్తూ, విచారణలో వేగం చేయాలని డీఎస్పీ మొగ్లయ్యను ఆదేశించారు.

ప్రభుత్వ లక్ష్యం మేరకు మొక్కలు పెంచాలి

▸▸ అడిషనల్ కలెక్టర్ నర్సింగరావు



నక్కలపల్లి నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ నర్సింగరావు

ఇటిక్యాల, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రానున్న వర్షాకాలంలో నాటేందుకు ప్రభుత్వ లక్ష్యం మేరకు నర్సరీలలో మొక్కలను సిద్ధంగా ఉంచాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ నర్సింగరావు నర్సరీ నిర్వాహకులకు సూచించారు. శుక్రవారం మండలంలోని నక్కలపల్లి, కొత్తదేవరపల్లి గ్రామాలను ఎంపీడీవో మహ్మద్ అజహర్‌మొయిద్దీన్, ఏపీఎం శివజ్యోతితో కలిసి సందర్శించారు. అంతకుముందు అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలలను పరిశీలించి విద్యార్థులకు అందజేస్తున్న మెనూను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని విద్యార్థులకు క్రమం తప్పకుండా అందజేయాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం హరితహారంలో భాగంగా గ్రామంలోని పలుచోట్ల మొక్కలు నాటారు. వారివెంట ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.

రిజర్వేషన్ల పెంపుతో బీసీలకు సముచిత న్యాయం



గద్వాలలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

● మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎండీ బాబర్

గద్వాల టౌన్/ ఎర్రవల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల బీసీలకు సముచిత న్యాయం లభిస్తుందని మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎండీ బాబర్ అన్నారు. రిజర్వేషన్ పిలుపు నిర్ణయాన్ని స్వాగతిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం పట్టణంలోని పాతబస్టాండ్ సర్కిల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా మాట్లాడిన బాబర్, ఎన్నోఏళ్లుగా రిజర్వేషన్ల పెంపు కోరుతూ బీసీలు చేస్తున్న పోరాటాన్ని గుర్తించిన సీఎం సాహసోపేత నిర్ణయంతో బీసీలకు అండగా నిలవడం హర్షదాయకమన్నారు. కార్యక్రమంలో జమ్ములమ్మ ఆలయ కమిటీ చైర్మన్ వెంకట్రాములు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు గోవిందు, నరహరిగౌడ్, మురళి, నరహరి శ్రీనివాసులు, సతీష్, గంట రమేష్, వంట భాస్కర్, బంగి సుదర్శన్, బొట్టు సుధాకర్, మోబిన్, అన్వర్, నాగేంద్రయాదవ్, నాగులూయాదవ్, శ్రీనివాస్ యాదవ్, మోహన్ యాదవ్, ప్రవీణ్, గణేశ్ ఉన్నారు.

● పుటాన్‌దొడ్డిలో

వెనుకబడిన వర్గాలకు స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇవ్వడంతో శుక్రవారం ఎర్రవల్లి మండలంలోని పుటాన్‌దొడ్డిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీసీ నాయకులు ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదాం

▸▸ బీఆర్‌ఎస్ గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జి బాసు హనుమంతు నాయుడు

మల్దకల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని బీఆర్‌ఎస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జి బాసు హనుమంతు నాయుడు సూచించారు. శుక్రవారం మల్దకల్‌లోని స్వయంభూ లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల సన్నాహక సమావేశానికి హనుమంతునాయుడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంతకుముందు పార్టీ నాయకులు, కార్యకర్తలు హనుమంతు నాయుడికి భారీ ర్యాలీతో పెద్దఎత్తున స్వాగతం పలికారు. హనుమంతు నాయుడు సమక్షంలో మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బాసుహనుమంతు నాయుడు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు సమష్టిగా కష్టపడితే గెలుపు మనదేనన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కార్యాచరణపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో మాజీ జట్పీటీసీ సభ్యురాలు బాసు శ్యామల, రాఘవేంద్రరెడ్డి, పటేల్ జనార్దన్ రెడ్డి, రాజా రెడ్డి, చక్రధర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, మెనేష్, డి.శేఖర్‌నాయుడు, గంజిపేట రాజు, సోమశేఖర్‌రెడ్డి ఉన్నారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరి రిమాండ్

గద్వాల క్రైం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కళాశాల విద్యార్థులు అయిన రవితేజ, చరణ్‌తేజపై కత్తితో దాడి చేసిన సంఘటనలో శుక్రవారం ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఎస్ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని గంజిపేట కాలనీకి చెందిన కళాశాల విద్యార్థులు అయిన రవితేజ, చరణ్‌తేజపై ఎరుకలి రాజు, ఉదయ్, భానుతో పాటు మరికొందరు రెండు రోజుల క్రితం కోటబురుజు సమీపంలో కత్తితో దాడిచేయగా వారికి గాయాలైన సంఘటనలో కేసు నమోదు చేశారు. సంఘటనలో ఎరుకలి రాజుతో పాటు ఉదయ్‌ను శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించేలా తీర్పు వెల్లడైనట్లు ఎస్ఐ తెలిపారు.

వార్డుల పర్యటనకు ప్రణాళికలు

▸▸ 8వ వార్డులో పర్యటించిన అధికారులు

▸▸ సంతోషం వ్యక్తం చేస్తున్న అయిజ పట్టణ ప్రజలు



8వ వార్డులో సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్

అయిజ టౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): అయిజలోని వివిధ వార్డుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి మునిసిపాలిటీ అధికారులు నడుం బిగించినట్లు తెలుస్తుంది. 20 రోజులుగా ఆంధ్రజ్యోతి దిన పత్రికలో 'వార్డువాచ్' పేరుతో వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై కథనాలు ప్రచురితమవుతూనే ఉన్నాయి. ఆయా వార్డుల్లో ఉన్న ప్రజలు కూడా పత్రిక ద్వారా తాము ఎదుర్కొంటున్న సమస్యలను చెబుతున్నప్పటికీ మునిసిపాలిటీ అధికారులు స్పందించకపోవటంపై జనం ప్రశ్నించటం మొదలుపెట్టారు. దీంతో చేసేది లేక మీడియాకు సమాచారం ఇవ్వకుండా వార్డుల్లో అధికారులు పర్యటిస్తున్నారు. ప్రజా సమస్యలను తెలుసుకుంటున్నారు. ఇప్పటికే 3, 4, 7, 8, 15, 16, 17 వార్డుల్లో నెలకొన్న వివిధ రకాల సమస్యలపై వరుస కథనాలు వెలువడిన కారణంగా ఆయావార్డుల్లో ప్రత్యేకంగా సమస్యలపై అక్కడి వారిని అడిగి తెలుసుకున్నారు. తాజాగా శుక్రవారం కూడా పట్టణంలోని 8వ, వార్డులో కమిషనర్, ఏఈ పర్యటించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించడంతో పాటు అడిగి తెలుసుకున్నారని కాలనీ ప్రజలు తెలిపారు. ఈ వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న మురుగునీటి గుంతను తొలగించాలని ఈ సందర్భంగా తాము అధికారులను కోరామని చెప్పారు.

ఇదిలాఉండగా వార్డుల్లో పర్యటిస్తున్న సందర్భంగా అధికారులు మీడియాకు ఎటువంటి సమాచారం లేకుండా జాగ్రత్త పడుతున్నట్లుగా తెలుస్తున్నది. ఏది ఏమైనప్పటికీ ఆంధ్రజ్యోతి పుణ్యమా అని వార్డుల్లోని సమస్యలపై ప్రత్యేక కథనాలు రావటం, అందుకు స్పందించి అధికారులు పర్యటించటంపై పట్టణ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.